# నేను - తను

బైట వాన కురుస్తూ ఉంది. వేపచెట్టు ఆకుల మీద చినుకులు లయ బద్ధంగా చేసే సవ్వడి నిరంతరాయంగా వినిపిస్తూ ఉంది.

ఒక్కోసారి మునివేళ్ళతో అలవోకగా మీటినట్లు సన్నని సడి.

మరోసారి వేయి వేళ్ళతో దురుసుగా బరికినట్లు సరసరమనే ధ్వని. ఈ రెండు గతుల మధ్య మధురమైన వానరాగం.

నిశ్శబ్ద నిశీధి.

చినుకుల పదసవ్వడులు తప్ప మరే చప్పుడూ వినిపించని నడిరేయి.

వాన కౌగిలింతలో చీకటి రేయి ఎంతగా కరిగిపోతోన్నా, నా కళ్ళమీదకు మాత్రం అది నిద్రగా అనువదించబడటం లేదు.

పక్క పడకమీదే ఆమె పడుకొని ఉంది. ఓరకంట అటుకేసి చూద్దామనే కోరిక ఎదలో ముకుళించిందిగాని, మనస్సుదాన్ని పట్టించుకోలేదు.

తను పడుకోవటం, మసలటం, పాపను దగ్గరకు తీయటం, పాలివ్వటం, నిద్ర పుచ్చటం, ముడుచుకుపోవటం అన్నీ సవ్వడులద్వారా స్ఫురిస్తూనే ఉన్నాయి. కళ్ళు మూసుకొన్నానేగాని చెవులు చాలా జాగ్రత్తగా పరిసరాల్ని గమనిస్తున్నాయి.

తను పూర్తిగా నిశ్శబ్ద చిత్రమై, నిదుర కుప్పలా పడివుంది. రెప్పలు అంటించుకొందేగాని నిద్రపోలేదనే విషయం నాకు బాగా తెలుసు.

పక్కనే పడిఉన్నా - ఆమె ఉనికిని మర్చిపోదామనేంత అహం నాలో తన్నుకొస్తూ ఉంది.

భోజనాలకు ముందే ఓ చిన్న విషయం మీద నాతో విభేదించింది తను.

భోజనంతోటే మనస్సులు కూడా అర్ధాంతరంగా విరిగిపోయాయి.

అప్పట్నించి ఎడమొహం పెడమొహంగా ఉంది.

నేను తన్ను పిలవదల్చుకోలేదు.

మాట్లాడదల్చుకోలేదు.

అందమైన అవయవాల అద్భుత అమరికవల్ల విర్రవీగే ఆమె తనువు సహాయంతో రాత్రిని అలవోకగా ఈదాలనికూడా లేదు.

ఆమె మొహం నాకేదో నిషిద్ధ వర్ణచిత్రంలా గోచరిస్తోంది. చేయిచాచితే అందే ఆమె దూరం మనస్సులో యోజనాలై విస్తరించుకొంటోంది.

సమస్య చిన్నదే... సున్నితమైనదే...

ఎంతపాటి సమస్య అయినా నా సాన్నిహిత్యం కంటే ముఖ్యమైంది కాదుగదా!

అయితే తనకు మాత్రం సమస్యే ప్రధానమైనట్లుంది.

అందుకే ఆమె మీద నాక్కోపంగా ఉంది.

ఎంతకోపంగా అంటే నాకు సంబంధించిన సర్వ ఆలోచనలకూ, సమస్త ఆవేశాలకూ కేంద్రబిందులైన ఆమె శరీరం.... పక్కపడకపైన సడిలేని గంధపుపొడి కుప్పలాపడున్నా... కళ్ళు మూసుకొని సైతం అటుకేసి కనుగుడ్లు తిప్పలేనంతగా.

ఆమెను నా ఆలోచనల్లోంచి తుడిచేద్దామనేంత కసి రేగుతోంది.

పసిశిశువు పక్కనున్న ఆమె ఉనికిని పూర్తిగా మర్చిపోదామని ఎంతో ప్రయత్నించాను.

అక్కడొక ఖాళీస్థలంగా ఊహించేందుకు చాలాసేపు కసరత్తు చేశాను. ఎప్పుడో నేర్చుకొన్న భావాతీత ధ్యానానికి సిద్ధమయ్యాను.

ఆమెను ఈ రాత్రికి నా మనస్సులోంచి తొలగించాలనే నేనుచేసే ఈ ప్రయత్నాలన్నీ కూడా ఆమె గురించేననే విషయం అర్థమయ్యేసరికి చాలా సమయమే పట్టింది.

తను మాత్రం నన్ను సులభంగా మనస్సులోంచి తొలగించినట్లుగా ఫోజులిస్తోంది. ప్రశాంతంగా నిద్రబోతున్నట్లు డంబాలు పోతోంది.

మా మధ్య లేచిన అభిప్రాయభేదం చాలా చిన్నదే.

అదింత వేళ్లానుకొనేందుకు కారణం ఆమె ప్రవర్తనే.

జరిగిన విషయాన్ని మననం చేసుకొనేకొద్దీ నాలో అహం జడలు విచ్చుకొంది.

ఉల్లిపొరై మా మధ్య లేచిన భేదభావానికి నా అహం ఉక్కుమలాము వేసేందుకు నడుం బిగించింది. మౌనంగా, మా మధ్య చెలియలికట్టలా పడుకొనివున్న పాపకు ఇటు వైపు నా గుండె కల్లోల సాగరమై ఎగిసిపడుతోంది.

విరిగిన అభిప్రాయ శకలాల్ని పరిశీలిస్తూ, అది విరిగేందుకు ఏర్పడిన నేపథ్యం వెనక ఆమె గయ్యాళితనాన్ని కొలుస్తూ వుండిపోయింది మనస్సు.

మా నడుమ వయ్యారాలు పోతూవున్న సరసమైన వాతావరణాన్ని ముక్కలు ముక్కలుగా ఖండించి వదలిన ఆమె నిర్లక్ష్యపు కత్తి వాదరను పరిశీలిస్తూ వుండిపోయాను.

ఇప్పటికయినా ఆమె తన పొరబాటును గుర్తించవలసింది. మగడిగా, మగాడిగా నా అభిప్రాయానికి విలువ నివ్వాల్సింది.

అబలగా, ఆలిగా నాతో సర్దుకుపోవలసింది.

కోతిపుందును బ్రహ్మాండం చేసింది.

ఒక చిన్న భేదభావాన్ని పట్టుదలగా పెంచి, మధురశర్కరగుళికయై తన్మయంగా మెల్లమెల్లగా కరిగిపోవలసిన ఈ రాత్రిని రాతి ముక్కను చేసి ఎదుట నిలిపింది.

బైట చినుకుల సడి కిటికీరెక్కల్ని ఉవ్వెత్తున నెట్టుకొస్తోంది.

ఉన్నట్టుండి, వేపచెట్టు ఆకులపైకి అలలు అలలుగా తోసుకొచ్చిన జడి ఉరవడి...ఒక్కసారి వేల తాచు పాములు పరువెడుతున్నట్లు సరసరమని శబ్దిస్తోంది.

కొంతలేటుగా అయినా డ్యూటీకొచ్చిన నిద్ర, ఎంతకూ కదలివెళ్ళని మెలకువను తట్టి సైగజేయబోయిందిగాని, మెలకువ కాస్తంత కసరుకొనేసరికి బిక్క మొగంవేసింది.

నిద్రను తరిమికొట్టేంత మనోవేదన.

ఆడదిగా ఎంతటి ఓర్పును ప్రదర్శించాల్సింది ఆమె! అలిగా నా భావాల్ని ఎంత గౌరవంగా శిరసావహించాల్సింది.!!

'కార్యేషుదాసి' అన్నారు గదా!

ఆమెలోని దాసిత్వాన్ని పూర్తిగా శంకించాల్సి వస్తోంది. అభిప్రాయాన్ని ఆమోదించటం కాదు ఇప్పటి సమస్య.

ఆమోదించవచ్చు తిరస్కరించనూ వచ్చు.

అభిప్రాయభేదం ఎవరిమధ్యనైనా సహజమే.

కానీ... భేదభావం కలిగినప్పటి క్షణాల్నీ ఆమె మానసిక స్థితిని గణించి భరించటమే ఇప్పుడు ప్రధాన సమస్య అయ్యింది.

నాతో విభేదించటం వెనక ఆమెలో ఎన్నిరోజుల, ఎన్నినెలల, ఎన్ని సంవత్సరాల మోహరింపో యిది?

అదే.... అదే ఇప్పటి సమస్యగా తోస్తోంది.

*　　*　　*　　*

పాపకు ఇటువైపు ఎప్పటి నుండో నేనింతగా అతలాకుతలమవుతోంటే....

ఇవేమీ పట్టించుకోని ఆమె, ఇంకా... ఇంకా... ఘనీభవిస్తోన్నట్లుంది.

నేనొకడిని ఇక్కడున్నాననీ, తన చర్యలవల్ల మానసికంగా ఆందోళన పడుతున్నాననీ గుర్తించదల్చుకొన్నట్లు లేదు.

నిద్రబోతున్నట్లు భ్రమింపజేస్తోంది.

పొరబాట్లు చేయటం ఎవరికైనా సహజమే.

వాటిని సరిదిద్దుకొనేందుకు ఇక్కడ పుష్కలమైన అవకాశాలున్నాయి గదా!

మగనిముందు పశ్చాత్తాపపడటం ఏమంత లోకువనీ! లేవొచ్చుగదా!

లేచి, రోజుటిలా ఇటుకేసి సర్దుకోవచ్చుగదా!

తనంతగా భీష్మించుకోవలసిన పనేమొచ్చిందని! మగాడ్ని....నేను నీలుక్కొని కూచోవచ్చు. ఆమెకది తగదు గదా!

తనకై తను లేచివస్తే నేను క్షమించనని పొరబడుతోంది కాబోలు.

ఇన్నేళ్ళ సహచర్యంలో నన్ను గురించి ఆమె అర్థం చేసుకుంది ఇదేనా? పగటి కీచులాటల్ని పడకదాకా రానిచ్చేంత అరసికుడ్ని కాదుగదా నేను. తెలిసీ తనెందుకు గడ్డకట్టుకుపోయింది?

బహుశా... నేనే ముందుగా తనను పిలుస్తాననుకుంది కాబోలు.

పడకదగ్గర దిగజారితే, దాన్ని రేపు పగటికి కూడా అన్వయించుకొని పగ్గాల్ని చేతికి తీసుకోవచ్చని భ్రమిస్తోందేమో!

ఎంత అహంభావం!

మగనికి వుండాల్సిన అహంకారం.

ఆడది అబలగా లొంగి, లోబడి, తృప్తిపరచినప్పుడు ఒక అనిర్వచనీయమైన ప్రాకృతిక సౌందర్యంతో వెలిగే పురుషుడి అహంకారం.

నా దగ్గర నయగారాలు పోవాల్సిన యీ గుర్రాన్ని ఆమె లొంగదీసుకోవాలనుకోవటం విడ్డూరంగా ఉంది.

ఇలాగే తెల్లార్లూ కాలాన్ని నిస్తేజం చేస్తుంది కాబోలు. తను అబలననే విషయాన్ని గుర్తుకు తెచ్చుకోదేమో!

మెల్లిగా లేచి రాదేమో!

ఈ రాత్రిని మిగిలిన ఈ కొద్దిపాటి రాత్రిని అయినా మధురంగా వెలిగించుకోవాలనే కాంక్ష లేదు కాబోలు.

ఆమె శరీర కావ్యాన్ని స్మరించుకొంటే చాలు నాలోని కోరికల పేటికలు చిటపట చిట్లుతున్నాయి.

పెదవులు దాహంతో ఎండుకుపోతున్నాయి. తన శరీరానికి చెందిన పురాతన సహజమద సౌరభాల కోసం ఊపిరులు రెపరెపలాడుతున్నాయి. తెలీని కట్టడి కోసం బాహువులు తీయగా బాధపడుతున్నాయి. ఊపిరుల్ని బిగించిపొందే వేడికోసం... ఆకాశమంత బరువైన వేడికోసం ఎదలు వెర్రిచూపులు చూస్తున్నాయి.

తనిప్పటికయినా లేచి రావొచ్చుగదా!

చివురుల అరచేతుల్తో ఆ అహాన్ని సమర్థిస్తూ నా పైకి ఎగబాకితే ఎంత ఉచితంగా ఉంటుందనీ! ఎంత ఆహ్లాదకరంగా ఉంటుందనీ,

ఆడదై తను కదలిరానందుకు భరంచరాని అసహనంగా ఉంది.

ఇప్పుడు అభిప్రాయభేదం కానేకాదు... సమస్య.

అది విరిగిపోయిన క్షణాలు మెదడులో వేరు పురుగులవటమే.

*　　*　　*　　*

తను మేలుకొనే ఉంది.

నిద్ర నటిస్తూ ఉంది.

ఇట్లాంటి పరిస్థితి వచ్చినప్పుడు ఆమె తెల్లార్లూ మేలుకొనే ఉంటుంది.

సందేహం లేదు.

నా మెలకువమీదనే ఆమెకేమైనా సందేహం ఉంటుందేమో!

నా అహాన్ని గుర్తించని మనిషి నా మనోవేదనని సైతం ఎట్లా పసిగడుతుంది?

నిద్రిస్తున్నాననే అనుకొంటుందేమో?

ఈ అనుమానం ఇప్పుడు నన్ను సందిగ్ధంలో పడేసింది.

నేనింకా మేలుకొనేవున్నట్లు ఆమె గుర్తించాలి. ఆమె చర్యలపట్ల తను అసహనపడుతున్నట్లుగా తెలుసుకోవాలి. మధన పడుతున్నట్లు, ఆందోళన పడుతున్నట్లు సైతం అర్థం చేసుకోవాలి. ఆమె కరిగి కదలి, తనంతతానుగా వచ్చి నన్ను తమలపాకు తీవలా అల్లుకుపోవాలి. బెట్టుచేసే నా అహాన్ని సమర్థిస్తూ అచ్చమైన ఆడతనమై నాలో కరగాలి.

నేను నిద్రిస్తున్నానని ఆమె భావిస్తోందేమోననే అనుమానం నన్ను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

నేనింకా మేలుకొనేవున్న సంగతినీ, ఆమెను గురించి అంతులేని అసహనాన్ని అనుభవిస్తోన్న దృశ్యాన్ని ఆమెకు అర్థమయ్యేలా చేసేందుకు చాలా ప్రయత్నించాను. ఉస్సురని తెగబారెడు నిట్టూర్చాను. లేచి అటు ఇటు పచార్లు చేశాను. దగ్గాను, తుమ్మాను, దగ్గరగావెళ్ళి మంచాన్ని రాచుకొంటూ తిరిగాను. వస్తువుల్ని శబ్దమయ్యేలా జరిపాను.

టీవి ఆన్‌జేసి సౌండ్ పెంచటం తగ్గించటం నిర్విరామంగా చేశాను.

ఆమెలో ఎలాంటి చలనమూ కన్పించలేదు.

నిజంగా నిద్రపోయివుంటే యీ చప్పుళ్ళకు ఎప్పుడో మేలుకొనేది. మేలుకొని వుండటంవల్లే భంగిమకూడా మారకుండా పడుకొని ఉంది.

అంతకంతకూ ఆమె నిశ్చల మౌనతటాకమవుతోంటే... నేననుకొంటోన్న ఆమెలోని అహం కరిగి కరిగి నా పాదాలకేసి ప్రవహించనందుకు... నాలోని మరో నేను అసహనాన్ని పిచ్చిగా కౌగలించుకొంటున్నాను.

మెదడంతా రగిలిపోతూ వుంది.

పిచ్చిపట్టిన వాడిలా ప్రవర్తించాలనిపిస్తోంది.

ఎదురుగా క్యాలెండర్‌లోంచి వయ్యారాలుపోతూ వున్న సినిమాసుందరి బొమ్మను నిలువునా చించేయాలనిపిస్తోంది.

అలారం పీస్‌ని గణగణ మోగించాలనిపిస్తోంది. కిటికీ రెక్కల్ని దబదబా మూసి తెరవాలనిపిస్తోంది.

స్టౌ అంటించి పెద్దశబ్దం వచ్చేలా చాలాసేపు మండించాలనిపిస్తోంది.

బ్లేడుతో వేలుగీరుకొని, కారిన రక్తాన్ని బనియన్ నిండా అద్ది, ఉదయం ఆవిడ లేవగానే కళ్ళబడేలా చేయాలనిపిస్తోంది.

ఇంకా ఎన్నో... ఎన్నెన్నో... పిచ్చిపిచ్చి పనులు, ఉన్మాదపు చేష్టలు ఊహకొస్తున్నాయి.

క్రమక్రమంగా అన్నీ చేశానుగానీ....

ఆమె శరీరంలో చలనం తేలేకపోయాను.

* * * *

ఇప్పుడు నా పడకమీద నేను నిశ్చలంగా పడుకొని ఉన్నాను. ఆమె ప్రవర్తన నా గుండెల్నిండా వేదనల బరువెత్తింది.

నా పరిస్థితి నాకే అత్యంత దయనీయంగా అనిపిస్తోంది. ఆమె మౌనం నన్ను తిరగేసి మరగేసి జొన్నరొట్టెలా కాల్చుతోంది.

క్షణక్షణానికి ఆమె మౌనం మీద వేయించబడుతోన్న నా అహం చిట్లి బీటలు వారేందుకు సిద్ధమైనట్లుగా కూడా అన్పిస్తోంది.

విభేదించిన అభిప్రాయమేదో నాకిప్పుడు అసలు గుర్తుకు రావటం లేదు.

నా అభిప్రాయంతో ఆమె విభేదించటం ఒక సమస్యగాకూడా అన్పించటంలేదు.

ఇప్పటి సమస్య అంతా... ఆమె కదలివచ్చి నాలో ఐక్యం కాలేదనే!

ఆమె కళ్ళు తెరచి చూడటం, నాకేసి కొంతైనా కదలటం, జరిగినదంతా ఓ పీడకలలా భావిస్తున్నట్లుగా వ్యవహరించటం, నాపక్కకు రావటం... నేనిప్పుడు బతికేందుకు ఇవే ప్రాణవాయువులు.

ఇన్ని అవస్థలు ఆమె పడక్కర్లేదు. తనొచ్చి నా మంచాన్ని తాకితే చాలు... కేవలం మంచం పట్టెను ముట్టుకొంటే చాలు... మంచమే అన్ని సమస్యల్ని పరిష్కరిస్తుంది.

ఇన్ని కోరికలు కూడా దురాశేనేమో!

ఆమె ఒక్కసారి కళ్ళు తెరిచి నాకేసి నవ్వేచూపుల్ని దొర్లిస్తే చాలు...

నా ఆశలన్నీ గాలికి పోయేట్టున్నాయి.

ఈ బాధ భరించరానిదిగా ఉంది.

ఆసమయంలో వెక్కి వెక్కి కుళ్ళి కుళ్ళి ఏడవాలనిపిస్తోంది. ఇంతలావు మగాడ్ని... అలా ఏడవటం ఎంత అసహజంగా ఉంటుందని! కనీసం నటించనయినా నటిద్దామనుకొన్నాను.

నటించాను... సహజమనిపించేలా నటించాను.

ఆమెలో ఏమాత్రం చలనం కన్పించలేదు.

ఇప్పుడు నిజంగానే ఏడుపొస్తోంది.

నేనొక ఏ దిక్కులేని ఒంటరివాణ్ణిగా భావన కలుగుతోంది.

ఈ ఒంటరితనం క్రూరమైందిగా, హేయమైందిగా, అసహనమైందిగా, పగవారిక్కూడ రాదగనిదిగా అన్పిస్తోంది.

నాకిప్పుడు తోడుకావాలి.

ఒంటరితనాన్ని పోగొట్టే తోడుకావాలి.

అవును... నాలోవున్న ఈ అహంకారమే నా తోడును దూరం చేసింది.

నేనొక ఎండాకాలపు వడగాలిలా ఆమెకు అనుభూతికొస్తున్నాను కాబోలు.

చివురాకు పక్కన పొంచున్న గొంగళి పురుగులా తోస్తున్నానేమో బహుశా.

దీనంతటికీ కారణం నా అహంకారమే.

ఆరుద్ర పురుగుతో ఆడుకొనే చేతివేళ్ళలాంటి అహంకారం. నా అహంకారమే నన్నింత ఒంటరివాడ్ని చేసింది.

ఒక్కసారి తను కనురెప్పలు తెరచి నాకేసి చూస్తే చాలు.

ఆమె... చలిగాలి అలై నా ఒంటరితనాన్ని స్పర్శిస్తే జలదరించి వర్షించాలని వుంది.

నా కళ్ళవెంట నాకు తెలీకుండానే తడి వూరుతోంది.

బైట వర్షం ఉధృతి కూడా హెచ్చినట్లుంది.

ఆమె కరుణకోసం నేనిప్పుడు కరువునేలలా ఎదురుచూస్తున్నాను.

ఆసమయంలోనే మా మధ్య 'కేర్' మనే శబ్దమైంది.

మరుక్షణమే ఆమె కదలిన సవ్వడి... శిశువును తనకేసి పొదుపుకున్న చిరుసవ్వడి... పసిపాపను సముదాయిస్తోన్న కదలిక...

కొంత సమయం తర్వాత నాచేతికి ఏదో స్పర్శ మునివేళ్ళతో సన్ననిరాపిడి.

ఆ స్పర్శగురించిన స్పృహ తెలిసివచ్చేసరికి నా మెదడు సాంతం శూన్యమైంది. స్పర్శను గురించిన తెలివి మాత్రమే అందులో మిగిలిపోయింది. పరిసరాల్ని గురించిగానీ, శరీరాన్ని గురించి గానీ ఎలాంటి జ్ఞానమూలేదు

కేవలం ఆ ఒక్క స్పర్శానుభూతి మాత్రమే అక్కడ నిండి వుంది. నా సర్వేంద్రియాలూ ఆమె స్పర్శించిన ప్రాంతంలో కేంద్రీకృతమై, నేనంతా శూన్యమైన ఈ విచిత్ర అనుభూతి చాలా కొత్తగా ఉంది.

ఆమె స్పర్శ కలిగించిన తీవ్రమైన అనుకంపనల్నించి ఊపిరికోసం తలెత్తిన నా మనస్సు ఒక్కసారిగా రెక్కలు విప్పిన విహంగమైంది.

శిశువుకేసి కదలిన ఆమె చేయి సంకల్పింతంగానో, అసంకల్పితంగానో అచ్చమైన ఆడతనమై నన్ను మృదువుగా తాకింది.

అంతవరకే నాకు గుర్తుంది.
తర్వాత నేను నేనుగా మిగల్లేదు.
నేనో నీటి బుడగనై పేలిపోయాను ఎర్రనీటి యేటినై ఉరకలెత్తాను.
ఆమెను నా గుండెల సుడిగుండాల్లో పసిపాపలా తిప్పాను.
నేను ఆమెనై, అబలనై, పసిపాపనై గారాలు పోయాను.

◆ స్వాతి మంత్లీ - మే, *2001* ◆